## గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు కొనసాగించాలి



సమావేశంలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు, అధికారులు

లింగంపేట, జూన్ 18 : మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు కొనసాగించాలని ఎంపీడీవో నరేశ్ సూచించారు. లింగంపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభమైందని, మురికి కాలువలు శుభ్రం చేయించడంతోపాటు పూడికను తొలగించాలని సూచించారు. రహదారులపై ఉన్న గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. దోమల నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటిని క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలని సూచించారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి మల్హరీ, ఏపీవో నరేందర్, ఆర్ డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలతో పాటు ఆయా పంచాయతీల కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే షీటీంకు తెలియజేయాలి




ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 18 : ఆకతాయిలు అసభ్యంగా ప్రవర్తిస్తే ఏమాత్రం భయపడకుండా వెంటనే షీటీం సభ్యులకు సమాచారం ఇవ్వాలని షీటీం సభ్యుడు శ్రీనివాస్ సూచించారు. ఎల్లారెడ్డిలోని బస్టాండ్‌లో వారు ప్రయాణికులకు సైబర్ నేరాలు, రోడ్డు భద్రతా నియమాలు, షీటీం కార్యక్రమాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఎవరైనా ఊరెళ్లినప్పుడు నగలు, డబ్బులు, ఇంటితాళం చెవి వెంట తీసుకెళ్లాలని అన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటుచేసుకుంటే దొంగతనాలను అరికట్టవచ్చన్నారు. అసభ్యంగా ప్రవర్తిస్తే 8712686094ను ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అవగాహన కార్యక్రమంలో షీటీం సభ్యులు సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఖాతాలో డబ్బులు జమ

బాన్సువాడ, జూన్ 18 : బాన్సువాడ నియోజకవర్గంలోని బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లోని 27,536 మంది రైతులకు వారి ఖాతాల్లో రూ.17,36,86,423 రైతు భరోసా పథకం కింద జమయ్యాయని బాన్సువాడ వ్యవసాయ శాఖ ఏడీఏ అరుణ బుధవారం తెలిపారు.

# భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

బాన్సువాడ, జూన్ 18 : భూ సమస్యలను భూ భారతి రెవెన్యూ సదస్సులో పరిష్కరించుకోవచ్చని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. నస్రుల్లాబాద్ మండలంలోని నెమ్లి గ్రామంలోని వెల్‌నెస్ సెంటర్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖానలో సిబ్బందితో మాట్లాడారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం వెల్‌నెస్ సెంటర్‌లో వైద్యం కోసం వచ్చిన వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు . నెమ్లి గ్రామంలో కొనసాగుతున్న భూభారతి సదస్సును సబ్ కలెక్టర్ కిరణ్మయితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రెవెన్యూ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, తహసీల్దార్ సువర్ణ తదితరులు ఉన్నారు.

**మంజూరు పత్రం అందజేత**

బాన్సువాడలోని రెండో వార్డులో ఉన్న బీడీ వర్కర్స్ కాలనీలో లబ్ధిదారుకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రం కలెక్టర్ అందజేశారు. కాలనీలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయనవెంట సబ్ కలెక్టర్ కిరణ్మయి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గంగాధర్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, వార్డు ఇన్‌చార్జి లింగమేశ్వర్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు. బాన్సువాడ పట్టణంలోని సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రేషన్ దుకాణాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం రేషన్ కోసం వచ్చిన లబ్ధిదారులకు కలెక్టర్ బియ్యం పంపిణీ చేశారు.



నెమ్లి గ్రామంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

బాన్సువాడ రూరల్, జూన్ 18 : తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ గురుకుల పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, మెనూ ప్రకారం భోజనం అందించాల్సిన బాధ్యత ప్రిన్సిపాల్‌పై ఉందని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. బాన్సువాడ మండలం కొయ్యగుట్ట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను సబ్ కలెక్టర్ కిరణ్మయితో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. వారంలో రోజువారీగా ఉన్న మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. అంతకుముందు మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రం ప్రాంగణంలో గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, తహసీల్దార్ వరప్రసాద్, డీఎల్‌పీవో సత్యనారాయణ రెడ్డి, గురుకుల ప్రిన్సిపాల్ లక్ష్మీబాయి, ఎంఈవో నాగేశ్వర్ రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

## హోంగార్డు కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం

బాన్సువాడ, జూన్ 18 : నస్రుల్లాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సాయిలు హోంగార్డుగా విధులు నిర్వహించి, ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. సాయి లు కుటుంబ సభ్యులకు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం రూ.పదివేల ఆర్థికసాయం అందజేసినట్లు ఎస్సై లావణ్య, పోలీస్ సిబ్బంది తెలిపారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్సై లావణ్య, పోలీస్ సిబ్బంది

# మట్టిని పూడ్చివేయించిన అధికారులు

కామారెడ్డి, జూన్ 18 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో ఉన్న 10వ వార్డులో అధికారులు రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో రోడ్డు తవ్వారు.. మరమ్మతులు మరిచారు శీర్షికన బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. స్థానిక అధికారులు తవ్విన రోడ్డును మట్టితో పూడ్చారు. రెండు నెలలుగా పట్టించుకోని అధికారులు 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనానికి వారు స్పందించారు. దీంతో నమస్తే తెలంగాణ పత్రికకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



తవ్విన రోడ్డును పూడ్చివేయించిన అధికారులు

## గంప గోవర్ధన్‌కు బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

మాచారెడ్డి, జూన్ 18 : కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఘన్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని గంప గోవర్ధన్ నివాసంలో కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో మల్లేశ్‌యాదవ్, సుదర్శన్‌గౌడ్, ఎడపల్లి శ్రీనివాస్, దయాకర్‌రావు, రాజేందర్, మల్లేశ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



బాలికల గురుకుల పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న యోగా మాస్టర్

లింగంపేట, జూన్ 18 : నిత్యం యోగా చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని డాక్టర్ చైతన్య కుమార్ సూచించారు. తాడ్వాయి మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం యోగా చేయడంతో ఆరోగ్య వంతులుగా ఉండవచ్చని వెల్లడించారు. విద్యార్థులు నిత్యం ఉదయం యోగాసనాలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో యోగా గురువులు స్రవంతి, అజయ్‌తోపాటు గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పోల్కంపేటలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

లింగంపేట, జూన్ 18 : లింగంపేట మండలం పోల్కంపేట గ్రామంలో బుధవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం ఎస్‌డీఎఫ్ నుంచి రూ.10 లక్షలు మంజూరైనట్లు గ్రామస్తులు తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణంతో ఎస్సీ కాలనీలో రాకపోకల సమస్య తీరనున్నదని వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆశ్వక్, నాయకులు నాగరాజు, ఆజయ్‌గౌడ్, సాయిబాబా, సంజీవరెడ్డి, కృష్ణమూర్తి, ఎల్లమయ్య, అనిల్, బన్సీలాల్, తిరుపతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 'బీబీపేటలో కళాశాల ఉన్నట్టా.. లేనట్టా?'

బీబీపేట్, జూన్ 18 : ఎన్నో ఆందోళనలు, పోరాటాల ద్వారా సాధించుకున్న జూనియర్ కళాశాల ఉన్నట్టా.. లేనట్టా అనే విషయమై అధికారులు స్పష్టం చేయాలని బుధవారం కళాశాల సాధన సమితి సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ విషయమై పట్టించుకోవాల్సిన స్థానిక వివిధ పార్టీల నాయకుల నిర్లక్ష్యంతోనే కళాశాల కొనసాగింపు తీవ్ర సందిగ్ధానికి లోనవుతున్నది. ఈ కళాశాల కొనసాగింపు విషయమై స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల సాధన సమితి డాక్టర్ సంతోష్‌గౌడ్, దేవునిపల్లి దేవరాజ్, శ్రీకాంత్, పృథ్వీరాజ్, భూమయ్య, కిరణ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ విద్య విజ్ఞాన్ సేవ పై అవగాహన

మాచారెడ్డి, జూన్ 18 : మండల కేంద్రంలో ఉన్న జడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం ఎన్‌ఎఫ్‌హెచ్‌సీ ఫౌండేషన్ ఇండియా ఆధ్వర్యంలో మిషన్ విద్య విజ్ఞాన్ సేవపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సేవ సైనిక్ అక్షిత, వ్యవస్థాపకుడు సైంటిస్ట్ మోహన్ మాట్లాడారు. పదో తరగతి పూర్తి చేసిన తర్వాత ఉన్న విద్య, వృత్తి అవకాశాలు ఐఐటీ, నీట్ వంటి కోర్సుల ప్రవేశంపై అవగాహన కల్పించారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు పదోతరగతి లో 90 శాతం మార్కులు, 75 శాతం సాధించిన దివ్యాంగ విద్యార్థులకు ఇంటర్ మొదటి, రెండో సంవత్సరానికి రూ.పది వేలు చొప్పున సరోజిని దామోదరన్ ఫౌండేషన్ ద్వారా అందించనున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు స్కాలర్ షిప్ కోసం www.vidya dhan.org వెబ్‌సైట్‌లో ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పూర్తి వివరాలకు 8068333500, ఫౌండేషన్ వాట్సాప్ నంబర్ 78927 82387ను సంప్రదించాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు పరిస్థితి విషమం



హైవే సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ప్రతాప్‌రెడ్డి

నాగిరెడ్డిపేట, జూన్ 18 : నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద శివారులో బోధన్, హైదరాబాద్ నూతన రహదారిపై మాల్తుమ్మెద గ్రామానికి చెందిన దిగంబర్ శర్మ ద్విచక్ర వాహనంపై నుంచి పడి తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో.. మెరుగైన చికిత్సల కోసం హైదరాబాద్‌కు తరలించారు. గోపాల్‌పేటలో పూజా కార్యక్రమాలు ముగించుకొని దిగంబర్ శర్మస్వగ్రామం మాల్తుమ్మెదకు వెళ్తున్నాడు. విత్తనక్షేత్రం దాటిన తర్వాత రహదారిపై నూతనంగా తారు వేసిన అంచులను కూలీలు తొలగిస్తూ డాంబర్‌ను రోడ్డు పక్కనే వేస్తున్నారు. రోడ్డుకు మరో పక్క నుంచి వస్తున్న వాహనాన్ని గుర్తించిన కూలీలు డాంబరును పక్కకు వేగంగా విసిరేయడంతో అది ద్విచక్రవాహనం చక్రాలు, ఆయనపై పడ్డాయి. దీంతో అదుపుతప్పి కింద పడడంతో తలకు తీవ్రంగా గాయమైనట్లు స్థానికులు తెలిపారు. గుర్తించిన కూలీలు పనులను వదిలేసి పారిపోయినట్లు తెలిపారు. రహదారి పనులు చేస్తున్న కూలీల నిర్లక్ష్యంతో ప్రమాదం జరిగిందని స్థానిక నాయకులు, గ్రామస్తులు ఆందోళన చేశారు. అక్కడికి చేరుకున్న రహదారి కాంట్రాక్టర్ రాంరెడ్డి స్థానికులతో మాట్లాడారు. దవాఖాన పూర్తి ఖర్చులు భరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో గొడవ సద్దు మునిగింది.

## గుంతలను తవ్వి సిద్ధంగా ఉంచుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 18 : వర్షాకాలం ప్రారంభమైనందున గుంతలు తవ్వి సిద్ధంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ప్రకాశ్ సూచించారు. బుధవారం ఎల్లారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బ్యాంకులో రుణాలు పొందేలా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి నాగరాణి

కామారెడ్డి రూరల్, జూన్ 18 : రైతులకు అధిక వడ్డీ రుణాల నుంచి తప్పించి ప్రభుత్వ బ్యాంకుల ద్వారా రుణాలు పొందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి నాగరాణి ఆదేశించారు. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి రైతు వేదికలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా రైతులకు రుణాల మార్పిడీ, మంజూరుపై న్యాయ చైతన్య సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ బ్యాంకు, వ్యవసాయ శాఖ అధికారులు రైతులు పాల్గొన్నారు. ఆర్‌బీఐ సూచనలు, రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు రైతులకు రుణాల మంజూరులో ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పిస్తున్నామని నాగరాణి అన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్ మాట్లాడారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సూపరింటెండెంట్ చంద్రసేన్‌రెడ్డి, ఏడీఏ అపర్ణ, ఏవోలు, ఏఈవోలు బ్యాంకు అధికారులు, కోర్టు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలకు కంప్యూటర్లు అందజేత

నాగిరెడ్డిపేట, జూన్ 18 : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు హైదరాబాద్‌కు చెందిన శ్రీదేవి రత్నమాల ఆమె కూతుర్లు ప్రత్యూష, నేహ సొంత డబ్బులతో.. ఐదు కంప్యూటర్లను విరాళం అందించినట్లు ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తెలిపారు. విద్యార్థుల కోసం కంప్యూటర్లు అందించిన శ్రీదేవి రత్నమాల కుటుంబసభ్యులకు పాఠశాల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గంజాయిసాగు చేస్తే సమాచారం అందించాలి

రామారెడ్డి(గాంధారి), జూన్ 18 : గంజాయిసాగు చేసినా, విక్రయించినా సమాచారం అందించాలని ఎక్సైజ్ అధికారులకు కోరారు. జిల్లా ప్రొబెషన్ ఎక్సైజ్ అధికారి 8712658969, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ 9440902780, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ 91103 39568, జిల్లా టాస్క్‌ఫోర్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ 87126 59984, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ 8712658987, సబ్‌ఇన్‌స్పెక్టర్ 8712686165కు సమాచారం అందించాలని కోరారు.

## బాన్సువాడలో యోగావాక్

బాన్సువాడ, జూన్ 18 : అంతర్జాతీయ యెగా దినోత్సవ దశాబ్ది వేడుకల్లో భాగంగా బుధవారం బాన్సువాడలో యోగా ప్రశిక్షకుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో యెగా వాక్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ యోగాపై అవగాహన ఉండాలన్నారు. రాబోయే 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పట్టణంలోని అంబేద్కర్ భవనలో ఉదయం 7 నుంచి 8 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, డాక్టర్ అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గంగారెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, అనిల్, లక్ష్మీనారాయణ గుప్తా, గౌస్, ఉదయ్ గుప్తా, ఉద్యోగులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల వ్యతిరేక దినాన్ని ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి, జూన్ 18 : నార్కోటిక్ జిల్లా కమిటీ నెలవారీ సమీక్షా సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినాన్ని ఘనంగా నిర్వహించాలని అన్నారు. ఉపన్యాస పోటీలు, వ్యాస రచన, చిత్ర లేఖన పోటీలు పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో నిర్వహించాలని సూచించారు. కామారెడ్డి జిల్లాను మాదక ద్రవ్యాల నిషేధ జిల్లాగా మార్చడమే లక్ష్యంగా ప్రణాళిక ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లాలో డ్రగ్ డీ అడిషన్ సెంటర్‌ను ప్రభుత్వ దవాఖానలో ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, డీఎస్పీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీలో పిల్లలకు మంచి వాతావరణం కల్పించాలి**

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 18 : అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలకు మంచి వాతావరణాన్ని కల్పించాలని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ దుర్గ, ఆయా తదితరులున్నారు.

# భూభారతితో రైతుల సమస్యలు దూరం



తహసీల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ కిరణ్మయి

ఎల్లారెడ్డి రూరల్/పెద్దకొడప్‌గల్/నాగిరెడ్డిపేట, జూన్ 18: రైతుల భూ సమస్యలు భూభారతితో దూరమవుతాయని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్, వెల్లుట్ల గ్రామాల్లో బుధవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సులకు వచ్చిన రైతులకు భూభారతిపై అవగాహన కల్పించారు. రైతుల పలు అనుమానాలను ఆయన నివృత్తి చేశారు. తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, గిర్దావర్ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది, రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తును త్వరగా పరిష్కరించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పేర్కొన్నారు. పెద్దకొడప్‌గల్‌లోని తహసీల్ కార్యాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను ఏవిధంగా పరిశీలిస్తున్నారన్న విషయాన్ని అధికారులకు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ్, నాయబ్ తహసీల్దార్ రవికాంత్ పాల్గొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగిసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. రైతుల నుంచి 34 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ అఖిల్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి రమేశ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి

పెద్దకొడప్‌గల్, జూన్ 18 : మండలంలోని కాటేపల్లి గ్రామంలో కుక్కలదాడిలో గొర్రె పిల్లలు మృతి చెందాయి. గొర్రె పిల్లల మందపై కుక్కలు బుధవారం దాడి చేయగా మూడు గొర్రె పిల్లలు మృతి చెందగా ఐదు గాయాల పాలయ్యాయని యజమాని గొల్ల సాయిలు వాపోయాడు. మంగళవారం కూడా కుక్కల దాడిలో ఒక గొర్రె పిల్ల మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. దీంతో 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయగా సంచార వాహనం బీజీ గా ఉంది రేపు కాల్ చేయండి అంటూ సమాధానం ఇచ్చారన్నారు. గాయాలైన గొర్రె పిల్లలను తీసుకొని మండల కేంద్రంలోని పశు దవాఖానకు వెళ్లగా తాళం వేసి ఉంది. సుమారు రూ.50వేల నష్టం వాటిల్లినట్లు బాధిత కుటుం బ సభ్యులు తెలిపారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెపిల్లలు

## ఉపాధి హామీ పనులపై సమీక్ష

పెద్దకొడప్‌గల్, జూన్ 18 : పెద్ద కొడప్‌గల్ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉపాధిహామీ పనుల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లతో ఎంపీడీవో సమిక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. ఉపాధి పనులు ఎస్టిమేశన్ ప్రకారం నిర్వహించాలని, పని వివరాలు పరిశీలించి కూలి చెల్లించాలని సూచించారు. పాంఫాండ్స్‌షిప్ పాండ్స్ కొలతల ప్రకారం నిర్మంపజేయ్యాలని సూచించారు. ఆయన వెంట ఏపీవో సుదర్శన్ ఉన్నారు.

## ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి



గ్రంథాలయాన్ని సందర్శించిన అడిషనల్ కలెక్టర్ చందర్‌నాయక్

రామారెడ్డి, జూన్ 18 : మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ చందర్‌నాయక్ అన్నారు. బుధవారం ఇండ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పలు ఇండ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలో గంథ్రాలయాన్ని సందర్శించారు. ఎంపీడీవో తిరుపతిరెడ్డి, మండల ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో పాశపు ధర్మారెడ్డి, సదాశివనగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రావుఫ్, రామారెడ్డి గ్రామ పంచాయతీ సెక్రెటరీ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికలు



స్పోర్ట్స్ స్కూల్‌కు విద్యార్థులను ఎంపిక చేస్తున్న ఉపాధ్యాయులు

పెద్ద కొడప్‌గల్/కామారెడ్డి రూరల్, జూన్ 18 : పెద్దకొడప్‌గల్ స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగో తరగతిలో ప్రవేశం కోసం మండల కేంద్రాల్లోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో సారిక( వడ్లం), మోక్షిత(వడ్లం) నవీన్ ( రతన్‌సింగ్ తండా) ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు సమయం ఇవ్వాలని సూచించారు. క్రీడలతో మానసిక ప్రశాంతత ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ కమల, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్య, వడ్లం ప్రాథమిక పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ధర్మేందర్, మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కామారెడ్డి మండలం గర్గుల్‌లోని జడ్పీహెచ్‌ఎస్‌లో ఎంఈవో ఎల్లయ్య ఆధ్వర్యంలో స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్ నిర్వహించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథం, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ హీరాలాల్, వ్యాయామ ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, రమేశ్, ప్రభులింగం, లక్ష్మణ్, శైలజ, విజయ్ కుమార్, ప్రజ్ఞా పాల్గొన్నారు.

## 'అధిక ఫీజులు వసూలు చేయొద్దు'

లింగంపేట(తాడ్వాయి), జూన్ 18 : ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో రామస్వామి అన్నారు. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో బుధవారం ప్రైవేటు పాఠశాలల యజమానులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం లేకుండా ఫీజులు పెంచొద్దని స్పష్టం చేశారు. సమావేశంలో ప్రైవేటు పాఠశాలల యజమానులు పాల్గొన్నారు.